క్లుప్తంగా

ఆర్టీసీ ఎండీకి శుభాకాంక్షలు


సజ్జనార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిషోర్

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి సజ్జనార్‌కు షాద్‌నగర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అమ్మా దీవించు..


తల్లి కాళ్లు మొక్కుతున్న శంకర్

షాద్‌నగర్: అమ్మా దీవించు అని విజయదశమి రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సెంటిమెంట్‌ను నమ్ముకున్న శంకర్.. తన తల్లి అంజమ్మ కాళ్లు మొక్కి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. విజయీభవ అంటూ తల్లి కొడుకును ఆశీర్వదించారు. అనంతరం చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు.

ఘనంగా అలాయ్ బలాయ్


అలయ్ బలాయ్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ సూచించారు. మండల కేంద్రంలోని అట్లాస్ మినీ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో అలాయ్ బలాయ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ ప్రజలు కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలను జరుపుకోవటం సంతోషకరమన్నారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం


బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

షాబాద్: క్రీడలతో మానసికోల్లాసం పొందవచ్చని చందనవెల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చందనవెల్లిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు సర్పంచ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చని తెలిపారు. ఓటమి విజయానికి నాంది కావాలని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

'కంది' తెచ్చిన తంట


- మొక్కలు విరిగాయంటూ దాయాదుల తగాదా
- ఇరువురిపై కేసు నమోదు

చేవెళ్ల: ఇంటి ముందు పెంచుకున్న కంది మొక్కలు విరిగాయని దాయాదుల మధ్య జరిగిన గొడవ పోలీస్‌స్టేషన్‌కు దారి తీసింది. ఈ సంఘటన చేవెళ్ల ఠాణా పరిధి మీర్జాగూడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మీర్జాగూడలో కావలి శివ తన ఇంటి పక్కన కందిమొక్కలను పెంచుకున్నాడు. ఆదివారం ఆ మొక్కలు విరిగిపోయి కనిపించాయి. అది ఎవరు విరిచారో తెలియదని, కాని ఇంటి పక్కనే ఉండే దాయాది శంకరయ్య కుటుంబ సభ్యులపైనే అనుమానం వ్యక్తం చేయడంతో పాటు.. దుర్భాషలాడాడు. దీంతో శంకరయ్య కుటుంబీకులు తమను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించారు. దీంతో ఇరువురు మధ్య మాటమాట పెరిగి ఇరు కుటుంబాల మధ్య గొడవకు దారితీసింది. మహిళ అని చూడకుండా తోసేశాడని శంకరయ్య భార్య పోలీసులకు శివపై ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురు ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

విజయదశమి వైభవం


మొయినాబాద్ రూరల్: దుర్గామాత ర్యాలీలో పాల్గొన్న భక్తులు


షాద్‌నగర్: శమీచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


చేవెళ్ల: దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


షాద్‌నగర్: జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న నాయకులు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వీర్లపల్లి శంకర్


షాబాద్ మండలం సోలీపేట్‌లో..

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లను కొలిశారు. ప్రత్యేక అలంకరణలతో పూజించారు. ఈ వేడుకలు సోమవారం విజయదశమితో అంగరంగ వైభవంగా ముగిశాయి. సరిసంపదలు, విజయానికి, శుభాలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని దసరా రోజు దర్శించుకోవడం వలన శుభం జరుగుతుందని ప్రజల నమ్మకం. అందువల్ల జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచి పోయిరావమ్మ.. మా తల్లి దుర్గామాత అంటూ భక్తులు ఆటపాటలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

సాక్షి నెట్‌వర్క్


మొయినాబాద్: దుర్గామాత ఊరేగింపులో కళాకారుల నృత్యాలు


మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లో..


అమ్డాపూర్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు


చేవెళ్ల: దుర్గామాత ఊరేగింపులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంజయ్య యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

- ఎంపీపీ రవీందర్ యాదవ్


బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్

కేశంపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విజయానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీపీ రవీందర్ యాదవ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తున్న అంజయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, రాజకీయంగా ఎదిగేందుకు ఎమ్మెల్యే సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంపేట, కొత్తపేట, బైర్కాన్‌పల్లి, ఇప్పలపల్లి గ్రామాల సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, నవన్‌కుమార్, కృష్ణయ్య, ఆంజనేయులు, మాజీ ఎంపీపీ విశ్వనాథం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

కొందుర్గు: బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని ముట్పూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ముట్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చుక్కమెట్టు గ్రామం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. చుక్కమెట్టు వాగుకు వంతెన నిర్మించి బీటీ రోడ్డు వేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. మరోసారి గులాబీ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు సందీప్, యాదయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం


ప్రచారం చేస్తున్న గణేష్ తదితరులు

- బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి
- జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్ కోరారు. మండలంలోని వీర్లపల్లి, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టారని తెలిపారు. గ్రామాలకు రోడ్లు, పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి శూన్యమని, ఆ పార్టీని నమ్ముకుంటే అభివృద్ధి జరగదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అంజయ్య యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పారెడ్డిగూడ సర్పంచ్ నర్సింహా, వీర్లపల్లి ఎంపీటీసీ లత, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీశైలం, కుమార్, సుదర్శన్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

షాబాద్: షాబాద్ మండలంలోని ఆస్పల్లిగూడ గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రచార రథాన్ని ప్రజలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ఇప్పటివరకు తమ గ్రామానికి ఎన్నడూ రాలేదని, ఆయన వలన ఎటువంటి అభివృద్ధి జరుగలేదని వాపోయారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఎవరికి ఇచ్చారు? ఎంత మందికి ఇచ్చారు? అని ప్రశ్నించారు. ప్రచారరథం డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా ఊరికి రానప్పుడు ఆయన ప్రచార రథం మా ఊరికి ఎలా వస్తుందని గ్రామస్తులు అడ్డుకున్నారు.


ప్రచార రథాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

కాంగ్రెస్‌కు ఓటు వేయండి

- ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం
- కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నందిగామ: అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కావలి కృష్ణయ్య పిలుపునిచ్చారు. మండలంలోని నర్సప్పగూడలో మంగళవారం కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ పేదలు అన్నిరకాలుగా అభివృద్ధి చెందాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, అందుకోసమే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రవీందర్, సురేందర్, అశోక్, చందన్ పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

కడ్తాల్: మండల కేంద్రంలోని ఎస్ఎల్ఆర్ గార్డెన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ ప్రచార కార్యాచరణ గురించి చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీచ్యానాయక్

మృతుల కుటుంబాలకు పరామర్శ

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయితీ పరిధిలోని మహల్‌ఎలికట్టకు చెందిన బుచ్చయ్య సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య మంగళవారం బుచ్చయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అదేవిధంగా ఎలికట్ట గ్రామానికి చెందిన అంజయ్య అనారోగ్యంలో ఇటీవలే మరణించాడు. మృతుని కుటుంబసభ్యులను కూడా బాబయ్య పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్, ఉపసర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, భవాని మాత ఆలయం చైర్మన్ కృష్ణయ్య, సంజీవయ్య యాదవ్, ఆర్లయాదయ్య తదితరులు ఉన్నారు.

వెంకయ్యను కలిసిన ఎమ్మెల్యే


వెంకయ్యను సన్మానించిన ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మేడిపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో వెంకయ్య సోమవారం దసరా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకయ్యను సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

వాహనదారులూ.. జర భద్రం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి సాగర్ రహదారి నుంచి కమ్మగూడ బాలయేసు చర్చికి వెళ్లే రోడ్డుపై పోచమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపైన పెద్ద గోతి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ రోడ్డులో గోతి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.


పోచమ్మ ఆలయం వద్ద గుంత

ఆగిన వంతెన నిర్మాణం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజల సహకారంతో పనులు ప్రారంభించిన సర్పంచ్

షాబాద్: షాబాద్–చర్లగూడ గ్రామాల మధ్య వంతెన నిర్మాణం పనులు ఆగిపోయాయి. దీంతో తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు కొట్టుకుపోవడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చర్లగూడెం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు ఎంతో ఆర్భాటంగా నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ.. కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించి మధ్యలోనే వదిలివేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు వేయాలని గ్రామస్తులు సర్పంచ్‌కు మొరపెట్టుకోగా ఆయన సానుకూలంగా స్పందించి తాత్కాలికంగా రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


తాత్కాలికంగా వేస్తున్న రోడ్డు

కట్టమైసమ్మ ఆలయంలో చండీయాగం

మొయినాబాద్: మండలంలోని సురంగల్ కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం చండీయాగం నిర్వహించారు. ఆరునెలల క్రితం ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఈ సందర్భంగా పుణ్యావాహచనం, మండపారాధన, చండీయాగం పూజలు చేశారు. చండీయాగంలో ఆదాయపన్ను శాఖ మాజీ అధికారి రాములు, సర్పంచ్ గడ్డం లావణ్య, మాజీ సర్పంచ్ లావణ్య, మాజీ ఉపసర్పంచ్ యాలాల జైపాల్‌రెడ్డి దంపతులు, మాజీ వార్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి దంపతులు, వ్యాపారవేత్త విజయభాస్కర్‌రెడ్డి దంపతులు, నర్సింహారెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, భాస్కరాచారి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎట్టయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలి


అలాయ్ బలాయ్ చేసుకుంటున్న నాయకులు

- సంఘం మండల అధ్యక్షుడు లింగం

షాబాద్: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగం ఆకాంక్షించారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సంఘం నాయకులతో కలిసి అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించి.. దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాసయ్య, జంగయ్య, వెంకటయ్య, బాల్‌రాజ్, జనార్దన్, రాజు, సుభాశ్, నర్సింహులు, గౌరీశ్వర్, సుధాకర్, సత్యనారాయణ, వెంకటయ్య తదితరులున్నారు.

మంచిరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఏనుగు బుచ్చిరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తుర్కగూడలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజల మనిషిగా పేరున్న కిషన్‌రెడ్డిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ పవిత్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు సురేశ్, వీ.సురేష్, రాజేందర్‌రెడ్డి, బుగ్గరాములు, ప్రభాకర్‌రెడ్డి, లింగారెడ్డి, జలంధర్, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు